# జోను టికెట్టు

మెయిలులో ఎక్కడా సూది మోపేందుకన్నా ఎడంలేదు. తొక్కితే వెళ్ళి వస్తున్నారు, జనం. అలాగే, ఉన్నంతలోనే చొరవగా, కూచునేందుకు చోటు చేసుకుని, పరుపు చుట్ట కిటికికమ్మికి ఓరగిలవేసి, అనుకుని, అంత సమ్మర్ధములోనూ కొంచెం కునుకు పట్టించు కుందామని, మూసిన రెప్పలు తెరవకుండా, తంటాలు పడుతూ ఉన్నాడు.

తెనాలి వచ్చింది: రైలు ఆగడం వ్యవధానంగా తీర్థప్రజగా లోపలికి – ఊఁ – వచ్చేస్తున్నారు; ఒక వయస్సు మళ్లు పడిలో ఉన్న కుండలాల ఆయన బస్తాలాగా దొర్లుకుంటూ క్రిందకాళ్ళు తొక్కుకుంటూ వచ్చిపక్కను కుదించుకు పోయినాడు. బండికదిలింది.

కదిలినప్పటినుంచీ, రైలుహోరుతో శ్రుతికలిపి 'శాంతాకారం భుజగ శయనం' అని ఎత్తుకుని భజగోవిందం, పంగశశిలో పద్యాలూ – ఒకటేమిటి, బండి ఎగర గొట్టేస్తున్నాడు. తాము ఒక్కళ్ళే టిక్కట్టు కొన్నట్టుగా – ఉన్న రవంత స్థలం ఆక్రమించేసుకు పడుకుని ఉన్న కంపెనీ వారసులు కొందరు, ఈ మోతకు నిద్రాభంగమై ఊరుకోమని ఆయనకేసి మోరలెత్తి, పరుపుమీద నుంచి ముంజేతులమీద లేచి, వివిధ భాషల్లోనూ అదలింపుగా అరుస్తున్నారు. బెదిరి ఉలిక్కిపడి గుక్కపట్టిపోయిన పసిగుడ్డును ఒకచేత్తో, రొమ్ముకు అదుముకుని, రెండోచేత్తో వక్షోజం రవికలోకి ఎగసనగా అమరించుకుంటూ అరవపిల్ల బల్లల సందునుంచి లేచి కూర్చుని, అరవంలో తెలుగు మెదిపి రంయిమనిపించి ముసలాయిన్ను తూర్పారబట్టింది. పొంగివస్తూన్న ధ్యానశ్లోకాలు అక్కడితో పుక్కిటబట్టి వెనుకటి ఉద్ధృతం తగ్గించుకుని కూని రాగాలలోకి దిగిపోయినాడు. ఆయన మానాన ఆయన్ను అల్లా పాడుకుంటూ, గొణుక్కుంటూ ఉండనీయకుండా సీతారామాంజనేయం గుజిలీ పుస్తకం చదువుకుంటూ కునికి పాట్లతో తూలుతూ ఉన్న చాకలిపేటనాయుడు ఒకాయన పుస్తకం మూసి తలగడ క్రిందపెట్టి సులోచనాలు తీసి, ఎర్రకట్టుపంచె కుచ్చెళ్ళతో ముఖం తుడుచుకుంటూ 'తమది ఏఊరు అయ్యా' అని అడిగాడు. ఇక ఆయన అందుకున్నాడు. – గొంతు సవరించుకుని: "మాదా అండి? మాదీ, తెనాలి తాలూకా కూచిపూడి. అసలు స్వస్థలం కృష్ణాతీరాన వెల్లటూరనుకోండి. అయితే మూడు తరాలుగా ఇక్కడనే ఉంటున్నాం. మా పెదతాతగారు – ఆయన పౌండరికయాజులు లేండి – మహాదొడ్డవాడు; జగత్పండితులు: గ్రామం పరుశురామ ప్రీతి అవుతూంటే ఒక్కడూ కట్టుబట్టలతో లేచివచ్చి, తన హయాములోనే ఒక్క చేతిమీదుగా ఇంత నిర్వాహకం చేశారు. మీ దయవల్ల ప్పటికీ ఇప్పటికీ మనం తిని నలుగురుని కనిపెట్టడానికి భగవంతుడు ఇంతఅన్నోదకాలు ఇచ్చాడు. నాకో

మొగపిల్లవాడు. వాడి కడుపున ఓ రెండు వెర్రివేపకాయలు: ఇదంతా ఆ దైవకృప."

"బాగుంది: ఇప్పుడు ఎందాకా దయచేస్తూండారు?"

"నేనాండి? నేను – పట్నం: మీరూ అక్కడికేనా? సరి: తోడుగా అమాటా, ఈమాటా చెప్పుకుంటూ వెళ్ళవచ్చును!"

"అక్కడ ఎవరన్నా బంధువు లున్నారా?"

"సరిపోయింది లెండి! లేకపోతే, ఇల్లువిడిచి పరాయిచోట విస్తరి వేస్తానా? నాకూ సూర్య నమస్కారాలూ, వైశ్యదేవం.... ఈ తతంగమంతా ఉందండోయ్! మా చెల్లెలు మనుమరాల్ని తీసుకు వెళుతున్నాను. – దిగబెట్టి వద్దామని, దాని పెనిమిటికి పట్నంలో అదేదో పత్రిక అచ్చువేసే ఆఫీసులో పని. నెలకో యాభైరాళ్ళు యిస్తారు. నేనసలు బయలుదేరను మొర్రో, రైలులో నానా మాలకూడుగా ఉంటుందన్నా, తప్పదని పట్టుబట్టారు పిల్ల, దానితండ్రీ వాళ్ళూనూ, పోనీ, యీ విడతలోనే రామేశ్వరం వెళ్ళి రావచ్చునుగదా అని మనసుకు కొంత సమాధానంగా ఉంది. పైగా చూడండి: దైవఘటన! పెళ్ళయి నాలుగు సంవత్సరాలాయెనా. ఇంతవరకూ నేను ఆ పిల్లవాడ్ని చూడటమే పడలేదండీ. కుర్రదాని పెళ్ళి ఔపోసనాలకి .... నేను పునహో సతారాప్రాంతాలకు సంచారార్థం వెళ్ళాను. తిరిగి వచ్చిన తరువాత మామనమడు మావైపులకే రాలేదు. సెలవ దొరుకదట కాదుబాబూ, పట్నవాసంలో...."

సంభాషణ ఈ ధోరణిలో చిలవలు పలవలుగా గంటల తరబడి నడుస్తూనే ఉన్నది, రైలుతోబాటు.

నెల్లూరు వచ్చింది, అప్పటికి యావన్మందీ బాగా నిద్దర్లలో ఉన్నారు. టిక్కెట్లు సరిచూడటానికి తెల్లదొర పెట్టెలోకి వచ్చి, తలుపుకేసి చేత కత్తెర టకటక లాడించుతూ తణికీ చేసుకుంటూ వచ్చి, ముసలాయన పక్కను నిద్రపోతున్న యౌవనుణ్ణి హెచ్చరించాడు. అతడు బద్ధకంతో 'జోన్' అని మూలిగాడు. శ్వేతస్వామి అంతతో సంతృప్తి పడకుండా 'టికెట్ ప్లీజ్' అని రెట్టించగా, విసుగుతో లేచికూర్చుని, ముఖంకేసి మెరమెరాచూసి, తలక్రింద ఉన్న కోటుజేబులో నుంచి మడతకార్డు తీసి యిచ్చాడు...అందుకుని కొంచెం జబర్దస్తీతో 'నేమ్‌ప్లీజ్' అన్నాడు శ్వేతస్వామి. 'రాజమన్నారు, ఎం.ఏ' అని నదురూ బెదురూ లేకుండా చెప్పి, ఫేస్ తిరిగి పుచ్చుకుని, నిద్రలోకి పోబోయినాడు యౌవనుడు. ముసలాయన విప్పారిన ముఖంతో అతనివంక చూసి 'చూడుబాబూ' అని భుజంపట్టి ఊగించాడు.

"ఏమండీ"

"మనయింటిపేరు?"

"జనస్వామివారు"

"అరి నీకడుపుడకా! నన్ను చూసేనా, ఇందాకటినుంచీ ఎవరో పరాయి వాడిలాగా పలుకరించకనన్నా పోతివి? మీ యింటికే వస్తున్నాను."

'అలాగా'

"అవునోయ్: నీ భార్యను తీసుకు వస్తున్నాను. ఆడవాళ్ళ బండిలో వుంది."

"మంచిది"

"అదేమిటోయ్, పెళ్ళాం వస్తూందంటే ఎగిరి గంతులేయాలిసిందల్లా 'మంచి'దని అలా నీళ్ళు నములుతావేం? ఏమోనయ్యా. ఈ కాలం వాళ్ళ తగతీ ఇదే కాబోలు"

"ఆహా"

"ఆహా ఊహీని! చెప్పేవాళ్ళులేక చెడిపోతున్నార(రా? అయినా నాకెందుకూ, నీపెళ్లాం ఇష్టం, నీ ఇష్టం. తెల్లవారగానే వెళ్ళి కాస్త కాఫీ అదీ తెచ్చిపెట్టు. పెద్దముండావాణ్ని నేను కాలుతీసి కాలువేసేసరికి రైలు కూస్తుంటే, యెలాగా అనుకుంటూంటే నువ్వే కనిపించావు. ఇకనేం...."

"ఏమీ లేదు. నేను అమె ముఖం చూడను"

"హాc"

"నాకు ఆమె తోడబుట్టిన దానితో సమానం"

"అరి, నీ –"

"ఊరుకోండి – ఇంతటితో: ఇంకా రగడ పెంచితే....(గ్రంథం చాలాదాకా పోతోంది. పట్నం వెళ్ళేదాకా నన్ను మాటాడించకండి."

"నీ కేమైనా వెర్రి యెత్తిందా?"

"యెత్తింది"

"భగవంతుడా"

"ఇక మెదిలారా అంటే, ఈ బండిలో కూర్చోను."

– ముసలాయన మనసు తందనాలై పోతూన్నది. కాని, ఏమంటే ఏమి ముణుగుతుందో అనే భయంతో నిలువుగుడ్లు వేసుకు చూస్తూ కూర్చున్నాడు. పుణ్యవశాన అందరూ చాలామటుకు ఇంకా నిద్రలో ఉండటం మూలాన – రైలుమోత దానికితోడు .... ఈ మాటలు ఎవరి చెవినీ పడలేదు. టిక్కెట్లు చెక్ చేసి పై స్టేషనులో ఆఫీసరు దిగిపోయినాడు.

ఎండ తెర విచ్చుకుంది. సూళూరుపేటలో బండి అగుతూండగానే, అతడు ముందుగా ముసలాయనను దింపి, మరచెంబు పుచ్చుకుని కాఫీనింపించి తెచ్చి, ఆయన యిచ్చివచ్చేదాకా క్రింద నిలుచునిఉండి, చేయి ఆసరాయిచ్చి లోపలకి ప్రవేశ పెట్టాడు.

బేసిన్ బ్రిడ్జిలో దిగి .... సామాను దింపుకుని, "మీరు ఇక్కడకాదు. ఇంకా ముందు దిగడం. నేను ఆఫీసుకు వెళ్ళి హాజరు వేయించుకు వస్తాను" అని ముసలాయనకు కొంచెం ధైర్యం చెప్పి .... వెళ్ళిపోయినాడు.

సెంట్రలులో పిల్లదాని బండి దగ్గరకు వెళ్ళి మూటాముల్లే అందుకుని, లైసెన్సు కూలీలతో వితండం వేసుకుని, ఓ పట్టానికి ఎలాగైతేనేం తెమిలి, బండి చేసుకున్నారు.... రాయపేటకు....

– తారు రోడ్డుమీద కుదింపు లేకపోయినా తాతగారు, వాటాన సామాను తనమీదకు వాలబోయి నపుడల్లా .... అది సందు చేసుకుని .... మనుమరాలు సడికట్టకుండా కుములుతూ ఉన్నాడు. తీరా యింటిముందు ఆగిన తరువాత దిగమని ఆ అమ్మాయి హెచ్చరించడంతో యెలాగో బలవంతాన క్రిందకు దిగజారి, ఇక పట్టలేక ఆమె తలను తనకు అదుముకుని 'యీ యింటికీ నీకూ యిక రుణం తీరిపోయిందే మా తల్లీ' అంటూ యెలుగెత్తాడు.

లోపలినుంచి, బండిచప్పుడు విని నవ్వు ముఖంతో వచ్చిన అతడు అదుర్దాగా 'ఏమి'టంటూ సమీపించగా, ఏమీ లేదు. రాత్రి అంతా జాగరణ చేశాడు కాదూ – పెద్దతనం – పైత్యం యెక్కువై –' అని సమాధానం చెపుతూ, తానో రెక్క పుచ్చుకుని, పెనిమిటి రెండోపక్క అదుకోగా లోపలికి జేర్చింది.

"నాకు అంతా అయోమయంగా ఉంది"

"అంతేలే. వేన్నీళ్ళు స్నానంచేసి, కాస్త దాహం పుచ్చుకుని ఓ నిముషం కళ్ళు మూసుకో.... అన్నీ సర్దుకుంటాయి."

"నేను బ్రతికి ఉండగానే.... నా కళ్ళ ముందరే ఇలాటి దురంతం జరిగిన తరువాత...."

చూస్తూ వూరుకుంటే మాట దక్కదని ఆ అమ్మాయి–బలవంతాన లోపలికి తీసుకు వెళ్ళిపోయింది.

గంట సేపటికి...దోవతి పింజలు తీర్చుకుంటూ ముసలాయన సావడిలోకి వచ్చేసరికి రాజమన్నారూ, స్నేహితుడూ కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటూన్నారు. ముసలాయన – అతణ్ణి చూసి స్తంభించి పోయినాడు. ఆయన తడబాటు చూసి రాజమన్నారు చనువుగా 'దయచేయండి' అని ఆహ్వానించుతూ 'యెంత సత్యకాలం మనుషులండీ – ఎంత వేదన పడ్డారో పాపం – అనవసరంగా – మనుమరాలి కాపురం ఏమైపోతుందోనని. మనవాడు చెప్పాడు లెండి: ఇందాకటినుంచీ నవ్వుకుంటున్నాం – ఏమంటే నా టిక్కెట్టు యీతడు యెరువు పుచ్చుకుని ప్రయాణం చేస్తున్నాడు. అప్పుడు పట్టుబడితే చాలాదాకా మునుగుతుంది. దానిమీద ఉన్న పేరే తనదని బొంకాలి: వాళ్ళు వచ్చి అడిగినప్పుడు. అది పట్టుకుని మీరింత రంధి పెంచారు. వాడి ఎదుట మీకు యిందులోఉన్న కిటుకు వివరించడానికి వీలులేక మనవాడు మీ మనసు నొప్పించవలసివచ్చిందిట. ఇంతకూ కొంపతీసి మీ మనుమరాలితో ..... నీ మొగుడు నిన్ను వదిలేస్తానన్నాడని చెప్పలేదుకదా?' రాజమన్నారు ముగించేటప్పటికి ముసలాయన అనూపంగా నవ్వుతూ....కథానాయకుడివీ సప్రశ్రయంగా...."అరి నీకడుపుడకా – ఎంత నాటకం చేశావయ్యా? ఎన్ని పాపిష్టి ఊహలు పోయినవి నా మనసులో? అక్కడ నీపాళాన నీవు నాకు కొడపుట్టినదానివంటిది, ముఖం చూడనంటివి. **ఇక్కడ** బండీలోంచి కాలు క్రింద ఉంచేటప్పటికల్లా... యీ తనే యజమాని **అయినట్లుగా**.... రామరామ....ద్రౌపదికి వకలు అయిపోయిందా ఏమిటి మా మనుమరాలు పట్నవాసంలో" అనుకున్నాను. గాంతం పాపం! ఈ వారడి రేవుపంచాక్షరి ఆ యుతజపం....

ఇంతలో మడికట్టుకోవచ్చునని చెప్పడానికి ఆ అమ్మాయి గుమ్మందగ్గిరకు వచ్చి మగనికి సైగ చేసింది.

'అదిగో ద్రౌపది'

'నీ పుణ్యమాయెను, వూరుకో నాయనా! అది వింటే చిన్నబుచ్చుకుంటుంది.'

'మరేం తీసిపోయింది కాదు. మీరీ సారి సంచారం బయలుదేరి నప్పుడు ససందైన పాండవులను ఇంకా నలుగురిని ఏరుకు వచ్చి అమోఘమైన మీ వాక్కును దక్కించుకుతీరాలని వేధించుకు తింటుంది. తరువాత మీ ఇష్టం. ముందు భోజనం చేసి – ఏమోయ్ – లే – ఇవాళ మనం మడికట్టాలేమో?'

'వద్దు నాయనా - నా ఆచారం యెవరినీ బాధించదు'

'చాదస్తం'

'దేశాటనం పండిత మైత్రతాచ - ఇంతటితో దానికీ స్వస్తి....'

'అయితే మీరిక అవిచ్ఛిన్నంగా 'జోను' టిక్కెట్లమీద ప్రయాణం చేయనచ్చు. యెల్లుండి మంచిరోజే కనుక రామేశ్వరం వెళ్ళి రండి - ఆ సంగతి మీ మనుమరాలు ఉత్తరంలో వ్రాసింది లెండి ముందుగానే. బేగిరం తిరిగివచ్చేట్టయితే....ఆ టిక్కెట్టుతోనే మరో వృద్ధ పండితుడికి సేతుదర్శనం చేయిద్దాం. ఆయనకు మీ అంత చాద - కాదు అదృష్టం ఉంటే - రైలులో యీలాంటి నాటకమే ఆడవచ్చు.... ఏమంటారు?'

★ ★ ★